www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 1 జూన్ 2023
5
ఏలూరు



చినవెంకన్నకు రూ.2.32 కోట్ల ఆదాయం



ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ప్రముఖక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయానికి యాత్రికుల విరాళాల ద్వారా రూ.2,32,56,651 ఆదాయం లభించింది. ఆలయ హుండీలను బుధవారం ఉదయం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ లెక్కించారు. 20 రోజులకుగాను చేపట్టిన ఈ లెక్కింపులో నగదు రూపేణ పైనపేర్కొన్న నగదు, బంగారం 442 గ్రాములు, వెండి ఆరు కేజీల 572 గ్రాములు, పాత రూ.500 నోట్లు తొమ్మిది, రూ.వెయ్యి నోట్లు 11, పలు దేశాల కరెన్సీ సైతం లభించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వేండ్ర త్రినాథరావు తెలిపారు.

8న జెడ్పి ఛైర్మన్ ఎన్నిక

నోటిఫికేషన్ జారీ చేసిన ఎన్నికల కమిషన్
మే 14న ఛైర్మన్ పదవికి కవురు రాజీనామా
ఎట్టకేలకు నోటిఫికేషన్ జారీపై సభ్యుల్లో హర్షం
ఆశావహులంతా ఛైర్మన్ గిరి కోసం ముమ్మర యత్నాలు
9 మంది బిసి జెడ్పిటిసిల్లో ఛైర్మన్ గిరి దక్కేదెవరికో
ప్రజాశక్తి కథనాలకు స్పందన



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవికి ఈ నెల 8వ తేదీ ఉదయం 11 గంటలకు ఎన్నిక నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల నాలుగో తేదీలోపు జిల్లా పరిషత్ సభ్యులందరికీ సమాచారం అందించాలని నోటిఫికేషన్లో పేర్కొంది. ఎనిమిదో తేదీన ప్రత్యేక సమావేశం నిర్వహించి ఛైర్మన్ ఎన్నిక పూర్తి చేయాలని, ఒకవేళ ఎట్టి పరిస్థితులోనైనా ఆ రోజు సమావేశం జరగకపోతే తొమ్మిదో తేదీన ప్రత్యేక సమావేశం నిర్వహించి ఎన్నిక పూర్తి చేయాలని నోటిఫికేషన్లో పేర్కొంది. తొమ్మిదో తేదీన కూడా సమావేశం జరగని పక్షంలో ఎన్నికల కమిషన్కు సమాచారం ఇవ్వాలని తెలిపింది. జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవి ఖాళీగా ఉండటంపై కొన్ని రోజులుగా తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఛైర్మన్ ఎన్నిక జరపకపోవడంపై ప్రజాశక్తిలో వరుస కథనాలు ప్రచురితమవ్వడంతో అధికారులు స్పందించి ఎన్నికకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేశారు. వివరాలోకి వెళ్తే జెడ్పి ఛైర్మన్గా కవురు శ్రీనివాస్ బాధ్యతల్లో ఉన్నారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎంఎల్సి ఎన్నికల్లో వైసిపి ఆయనను ఎంఎల్సి అభ్యర్థిగా బరిలోకి దింపింది. కవురు శ్రీనివాస్ ఎంఎల్సిగా గెలుపొందడంతో తదుపరి ఛైర్మన్ ఎవరనే ఉత్కంఠ నెలకొంది. మే 14వ తేదీన కవురు శ్రీనివాస్ జెడ్పి ఛైర్మన్ పదవికి రాజీనామా చేసి 15న ఎంఎల్సిగా ప్రమాణస్వీకారం చేశారు. నిబంధనల ప్రకారం ఛైర్మన్ పదవికి రాజీనామా చేసిన వెంటనే ఇన్ఛార్జి ఛైర్మన్గా వైస్ ఛైర్మన్ను నియమించాల్సి ఉంది. అయితే జెడ్పికి ఇద్దరు వైస్ ఛైర్మన్లు ఉండటంతో ఎవరిని నియమించాలనే సందిగ్ధత నెలకొంది. దీంతో జెడ్పి ఛైర్మన్ పదవికి ఎన్నిక ప్రహసనంలా మారింది. దాదాపు 15 రోజులు దాటినా ఛైర్మన్ స్థానంలో ఎవరినీ నియమించకపోవడంపై రాజకీయంగా తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో ఛైర్మన్ పదవికి సంబంధించి బుధవారం నోటిఫికేషన్ జారీ కావడంతో జిల్లా పరిషత్ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఛైర్మన్ గిరి ఎవరికో..!

జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవి బిసిలకు రిజర్వు అయ్యింది. దీంతో యలమంచిలి జెడ్పిటిసిగా గెలుపొందిన కవురు శ్రీనివాస్ అప్పట్లో ఛైర్మన్గా ఎన్నికయ్యారు. కవురు రాజీనామా చేయడంతో ఆ పదవిని బిసి తరగతికి చెందిన సభ్యులతోనే భర్తీ చేయాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలో 48 మండలాలు ఉండగా 46 చోట్ల వైసిపి వారే జెడ్పిటిసిలుగా గెలిచారు. దీనిలో పది మండలాల్లో బిసి తరగతికి చెందిన జెడ్పిటిసి సభ్యులు ఉన్నారు. కవురు రాజీనామాతో ఇంకా భీమడోలు, భీమవరం, కాళ్ల, మొగల్తూరు, నరసాపురం, ఉంగుటూరు, పాలకోడేరు, పెదపాడు, ఉండి మొత్తం 9 మండలాల్లో బిసి తరగతికి చెందిన సభ్యులు ఉన్నారు. వీరిలో ఒకరిని జెడ్పి ఛైర్మన్ పదవి వరించనుంది. దీంతో వీరంతా తమ తమ ఎంఎల్ఎలను, ఎంపీలను, మంత్రులను కలుస్తూ ఛైర్మన్ పదవి కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అదే క్రమంలో ఛైర్మన్ పదవి ఈ సారి విభజిత ఏలూరు జిల్లాకు ఇవ్వాలని ఇక్కడి నాయకులు గట్టి పట్టుబడుతున్నారు. అందుకు ప్రత్యేక కారణం కూడా ఉంది. విభజిత పశ్చిమగోదావరి జిల్లా నుంచే శాసనమండలి ఛైర్మన్, ప్రభుత్వ చీఫ్ విప్, రెండు ఎంఎల్సి స్థానాలు, డిసిసిబి ఛైర్మన్, డిసిఎంఎస్ ఛైర్మన్ వంటి కీలక పదవులు చేజిక్కించుకున్నారు. కాబట్టి జెడ్పి ఛైర్మన్ పదవి ఏలూరు జిల్లాకు ఇవ్వాలని వీరంతా కోరుతున్నారు.

ఇటీవల దెందులూరు నియోజకవర్గంలో జరిగిన సమావేశంలో స్థానిక ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ పెదపాడు మండలానికి చెందిన జెడ్పిటిసి ఘంటా పద్మశ్రీకి జెడ్పి ఛైర్పర్సన్ పదవి ఖాయమని ప్రకటించారు. దీంతో ఛైర్పర్సన్ పదవి రేసులో ఘంటా పద్మశ్రీ ముందంజలో ఉన్నట్లు తెలుస్తోంది. ఛైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ వెలువడడంతో ఎవరికి వారు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ నెల ఎనిమిదో తేదీన ఛైర్మన్ ఎవరనేది తేలిపోనుంది.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇంటర సప్లిమెంటరీ పరీక్షలు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తం 26 కేంద్రాల్లో ఉదయం జరిగిన మొదటి సంవత్సరం ఒకేషనల్ బ్రిడ్జి కోర్స్ పరీక్షకు 778 మందికి 459 మంది హాజరు కాగా 319 మంది గైర్హాజరయ్యారు. 59 శాతం హాజరు నమోదైంది. మధ్యాహ్నం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 21 కేంద్రాల్లో జరిగిన ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ బ్రిడ్జి కోర్స్ పరీక్షకు మొత్తం 510 మందికి 355 మంది హాజరయ్యారు. 155 మంది గైర్హాజరయ్యారు. 70 శాతం హాజరు నమోదైంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి కె.చంద్రశేఖర్బాబు తెలిపారు.

నూజివీడు రసాలు.. ఆ క్రేజే వేరు..!

మార్కెట్ను ముంచెత్తిన మామిడి - మధుర ఫలం. తింటే సంపూర్ణ ఆరోగ్యం



ప్రజాశక్తి - ముసునూరు

మధుర మామిడి ఫలాలకు ఏలూరు జిల్లా నూజివీడు ప్రాంతం ఎంతో ప్రసిద్ధి. ఈ ప్రాంతంలోని పండ్ల తోటల విస్తీర్ణంలో 60 శాతానికి పైగా మామిడి తోటలే విస్తరించి ఉన్నాయి. ఏటేటా రాష్ట్రంలో 30 నుంచి 40 లక్షల టన్నుల మామిడి దిగుబడి వస్తుందని అంచనా. అందులో కృష్ణాజిల్లాదే అగ్రభాగం. జిల్లాలో నూజివీడు నుంచి 55 శాతం మామిడి దిగుబడి అవుతుందంటే ఎంత మేర విస్తరించి ఉందో అర్థమవుతోంది. ఉమ్మడి కృష్ణా, ఉభయ గోదావరి, విశాఖ, విజయనగరం, చిత్తూరు, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో మామిడి తోటలు విస్తరించినప్పటికీ నూజివీడు డివిజన్ ప్రాంతంలో పండే చిన్న, పెద్దరసాలతో పాటు హిమాయతీలకు జాతీయ, అంతర్జాతీయంగా డిమాండ్ ఉంది. ప్రధానంగా జిల్లాలో 1.70 లక్షల ఎకరాల్లో మామిడి సాగవుతోంది. ఒక్క నూజివీడు ప్రాంతంలోనే 85 వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. ఏప్రిల్ నుంచి జూన్ మాసాంతం వరకూ మామిడి పంట అందుబాటులో ఉంటుంది. నూజివీడు ప్రాంతంలో రసాలతో పాటు బంగినపల్లి, ముంత మామిడి, తోతాపురి ఇతర జాతులు ఎక్కువగా లభిస్తుంటాయి. చాట్రాయి, విస్సన్నపేట, రెడ్డిగూడెం, తిరువూరు, గంపలగూడెం, నూజివీడు, ముసునూరు, ఆగిరిపల్లి, బాపులపాడు, మైలవరం తదితర మండలాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. ప్రస్తుతం మార్కెట్లో మామిడికాయలు ఇబ్బడిముబ్బడిగా వచ్చేశాయి. ఎండలు బాగా ముదిరిపోవటంతో ఇక తోటల్లో కాయలు నిలిచే అవకాశం లేకుండా పోయింది. చెట్లపైనే కాయలు పండుతున్నాయి. రసాల పండ్లు మార్కెట్ను ముంచెత్తాయి. రైతు వద్ద పచ్చి మామిడి రూ.5 నుంచి రూ.10 వరకూ ధర పలుకుతోంది. వీటిని వ్యాపారులు కొనుగోలు చేసి మార్కెట్లో వివిధ సైజులను బట్టి డజను రూ.400 నుండి రూ.500 ధరలకు విక్రయిస్తున్నారు. ఇక తీపి మామిడి కాయ రైతు వద్ద రూ.15 ఉండగా మార్కెట్లో రూ.50 నుంచి రూ.100కు వ్యాపారులు విక్రయిస్తున్నారు. బంగినపల్లి పండ్లు కూడా మార్కెట్లోకి పెద్దఎత్తున వచ్చేశాయి. అవి కూడా వినియోగదారులకు అందుబాటులో లేని ధరల్లో ఉన్నాయి. డజను రూ.400 నుంచి రూ.450 వరకు విక్రయిస్తున్నారు. ఇక తీపి రసాలకు మంచి గిరాకీ ఉంది. రైతు వద్ద రూ.5 కూడా పలకని మామిడి మార్కెట్లో మాత్రం రూ.10 నుంచి రూ.15కు విక్రయిస్తున్నారు. కొందరు తోతాపురి మామిడిని తక్కువ ధరకు కొనుగోలు చేసి తాత్కాలికంగా పచ్చళ్లు పట్టుకుంటున్నారు.

మధుర ఫల రాజం 'మామిడి'

అదో అమృత భాండం. ఎన్నో దివ్య ఔషధ గుణాలు ఇందులో ఉన్నాయి. ఏటేటా వేసవిలో లభించే మామిడి కాయలు, పండ్లు తింటే ఎంతో మధురంగా ఉంటాయి. వేసవిలో వచ్చే వడదెబ్బ నుంచి మామిడి కాపాడుతుంది. జీర్ణ శక్తి మెరుగుపడుతుంది. ఆరోగ్యానికి దోహదపడే గుణాలెన్నో మామిడిలో ఉన్నాయి. రాష్ట్రంలో చిత్తూరు జిల్లా తర్వాత కృష్ణాజిల్లాలోనే మామిడి తోటలు అత్యధికంగా సాగవుతున్నాయి. జిల్లావ్యాప్తంగా దాదాపు 1.70 లక్షల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. నూజివీడు పేరు ప్రపంచ దేశాల్లో వ్యాపించడానికి మామిడి కారణంగా చెప్పక తప్పదు. నూజివీడు మెట్ట ప్రాంతంలో 60 శాతం మంది రైతులు మామిడి పంటను ప్రధాన సాగుగా చేపడుతున్నారు. రాష్ట్రంలో ఏటేటా 30 నుంచి 40 లక్షల టన్నుల మామిడి దిగుబడి వస్తుందని అంచనా. అందులో కృష్ణాజిల్లాదే అగ్రభాగం. జిల్లాలో నూజివీడు నుంచి 60 శాతం మామిడి దిగుబడి అవుతుందంటే ఎంత మేర విస్తరించి ఉందో అర్థమవుతుంది. ఒక్క నూజివీడు డివిజన్లోనే 85 వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. ఈ ప్రాంతంలో పండే చిన్న, పెద్ద రసాలతో పాటు హిమాయతీలకు జాతీయ అంతర్జాతీయంగా డిమాండ్ ఉంది. నూజివీడు ప్రాంతంలో రసాలతో పాటు బంగినపల్లి, ముంత మామిడి, తోతాపురి ఇతర జాతులు ఎక్కువగా లభిస్తున్నాయి. నూజివీడు డివిజన్లోని చాట్రాయి, విస్సన్నపేట, రెడ్డిగూడెం, తిరువూరు, గంపలగూడెం, నూజివీడు, ముసునూరు, ఆగిరిపల్లి, బాపులపాడు, మైలవరం తదితర మండలాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. ఈ ఏడాది మామిడి తోటలు పూత తక్కువగా వచ్చాయి. తోటల్లో మామిడి సగం చెట్లు మాత్రమే కాపు కాశాయి. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా మామిడికాయలు పెద్దఎత్తున జరుగుతున్నాయి. మార్కెట్లోకి పెద్దఎత్తున మామిడి పండ్ల విక్రయాలు జరుగుతున్నాయి. నోరూరించే మామిడిపండ్లు తినని వారు ఉండరంటే ఆశ్చర్యం కలుగకమానదు.

ఆరోగ్యపరంగా ప్రయోజనాలెన్నో

మామిడిలో సాచ్యురేటెడ్ కొవ్వు, కొలెస్ట్రాల్, సోడియం తక్కువగా ఉంటాయి. దీనిలో ఇంకా ఆహార ఫైబర్, విటమిన్ బి.6, విటమిన్ ఎ, విటమిన్ సి వంటి అద్భుతమైన వనరులున్నాయి. పొటాషియం, మెగ్నీషియం, రాగి వంటి ఖనిజాలు సమృద్ధిగా ఉన్నాయి. మామిడిలో క్వెర్సెటిన్, బీటాకెరోటిన్, అస్ట్రగాలిన్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు ఉన్నాయి. ఈ శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్ తటస్థీకరించటానికి ఉపయోగపడుతున్నాయి. గుండె వ్యాధి, అకాల వృద్ధాప్యం, కేన్సర్ వంటి ప్రమాదకరమైన వ్యాధులు వంటి సమస్యలతో కణాల నాశనం ఈ ఫ్రీరాడికల్స్ కారణంగా ఉంటుంది. ఈ మ్యాజికల్ మామిడికాయ కొన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి.

మామిడికాయలో అల్టిమేట్ విటమిన్ కంటెంట్ కలిగివుండటం వల్ల మంచి ఆరోగ్యం లభిస్తుంది. దీనిలో పొటాషియం (156 ఎంజీ-4 శాతం), మెగ్నీషియం (9 ఎంజీ-2 శాతం) సమృద్ధిగా ఉండటం వల్ల అధిక రక్తపోటు నియంత్రణలో సహాయపడుతుంది. కేన్సర్ ప్రమాదాలు, కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గిస్తుంది. మామిడి అజీర్ణం ఆస్తమా వంటి సమస్యలను తొలగించడంలో ఒక ప్రముఖ పాత్రను పోషిస్తుంది. మామిడిలో సహజంగా జీర్ణక్రియకు సహాయపడే డైజెస్టివ్ ఎంజైమ్స్ ఉంటాయి. మామిడి కాయ రక్తహీనతతో బాధపడే వారికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. మామిడిలో ఎ, సి విటమిన్లు శరీరంలో అధిక మొత్తంలో కొల్లాజెన్ ప్రోటీన్ ఉత్పత్తి చేయటానికి సహాయం చేస్తాయి. రోగ నిరోధకశక్తిని పెంచుతుంది,

మధుర ఫలం.. పండంతా దివ్య ఔషధాల గని

మామిడి గురించి ఎంత చెప్పినా అది తక్కువే! పక్వానికి రాని మామిడి కాయలను ముక్కలుగా తరిగి తినొచ్చు. అయితే వీటిని తిన్న వెంటనే చన్నీళ్లు తాగకూడదు. ఇలాచేస్తే పచ్చిమామిడికాయలో ఉండే జిగట వంటి పదార్థం గట్టిపడి గొంతులోని శ్లేష్మ పొరలను ఇరిటేట్ చేస్తుంది. పెరిగే పిల్లలకు మామిడి రసంలో ఉండే పోషక పదార్థాలు, పాలలో ఉండే మాంసకృత్తులు కలిసి సంపూర్ణాహారంగా పనిచేస్తాయి. మామిడి రసం వల్ల విరోచనాలవుతాయనుకవడం అపోహ మాత్రమే. మామిడి పండ్లు తిన్న తర్వాత కొంతమందికి సెగ గడ్డలు వస్తుంటాయి. శరీరంలో దాగున్న వేడిని బయటకు తెచ్చే గుణం మామిడికి ఉందనడానికి ఇలా జరుగుతుంది. వేడి శరీర తత్వం ఉన్నవారు మామిడి పండ్లను పరిమితంగా తినడం మంచిది.

నేటి నుంచి ఏలూరు కాలువకు నీరు

రూ.15 లక్షలతో తూడు తొలగింపు పనులు

ప్రజాశక్తి - భీమడోలు

ఏలూరు కాలువకు ఈనెల ఒకటో తేదీ నుంచి నీరు విడుదల కానున్న నేపథ్యంలో గుండుగొలను ఇరిగేషన్ కార్యాలయ పరిధిలోని కాలువలో తూడు తొలగింపునకు చర్యలు తీసుకున్నట్లు జల వనరుల శాఖ గుండుగొలను సహాయ ఇంజినీర్ కె.మాధవరావు తెలిపారు. ఈ మేరకు పూళ్ల గ్రామ శివారు నుంచి ఏలూరు తూర్పు లాకుల వరకూ 30 కిలోమీటర్ల పొడవున తూడు తొలగింపునకు రూ.15 లక్షలు, దీనికి అనుబంధంగా ఉన్న ఆగడాలలంక ఛానల్లో చెట్టున్నపాడు వరకూ గల 15 కిలోమీటర్ల పొడవున గల కాలువలో తూడు తొలగింపునకు రూ.తొమ్మిది లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. ప్రస్తుతం కాలువలో నిలిచిపోయిన తూడును కుళ్ల బెట్టేందుకు రసాయనాలు చల్లే కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఏలూరు కాలువకు నీరు విడుదలైన తర్వాత గుండుగొలను కార్యాలయ పరిధికి నీరు చేరడానికి సుమారు ఐదు రోజుల వ్యవధి అవసరం అవుతుందని, ఈ నేపథ్యంలో ప్రస్తుతం చల్లిన రసాయనాల వల్ల కుళ్లిపోయిన తూడుప్రవాహ వేగానికి కిందికి కొట్టుకుపోతుందని తెలిపారు. కాలువలో మిగిలిన తూడును కాలువలు వదలిన తర్వాత గట్లపై వేసే కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ప్రవాహ వేగానికి కాలువ శివారుకు చేరిన తూడును అక్కడ నుంచి ఎస్కేప్ ద్వారా కొల్లేరులోకి తరలిస్తామని చెప్పారు. కాలువలో తూడు తొలగింపు వల్ల నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని, ప్రస్తుతం ఉన్న ప్రవాహ వేగం 50 శాతం మెరుగుపడుతుందని గుండుగొలను సహాయ ఇంజినీర్ తెలిపారు.

సమస్యలు పరిష్కారమయ్యే వరకూ పోరాటం

ఉద్యోగుల రిలే దీక్షలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణారావు




ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి - పోలవరం

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి ఎంఎస్వి.రామకృష్ణారావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిఎ బకాయిలు చెల్లించాలని, ఎంఎల్ఎ, ఎంపీలకు జీతభత్యాలకు చట్టబద్ధత కల్పించిన విధంగా ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలకు చట్టబద్ధత కల్పించాలని, 20 సంవత్సరాల సర్వీసు దాటిన కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. 11వ పిఆర్సి బకాయిలు, సకాలంలో జీతాలు ఇవ్వాలని, 12వ పిఆర్సిలో కమిషన్లు లేకుండా జూలై 23 నుండి అమలు చేయాలని, కొన్ని రాష్ట్రాల్లో ఈ పద్ధతి ఇప్పటికే అమలులో ఉందని తెలిపారు. గత నెల 30వ తేదీన రాజమహేంద్రవరంలో సంఘం రాష్ట్ర మహాసభ జరిపి ఉద్యమ కార్యాచరణను ప్రభుత్వానికి తెలిపిందన్నారు. అక్కడ తీసుకున్న నిర్ణయాల ప్రకారం మే ఐదో తేదీన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డిమాండ్ల వినతి పత్రాన్ని, నోటీసులను అందజేశారన్నారు. రాష్ట్రంలో 13 జిల్లాల్లో 13 తాలూకా కేంద్రాల్లో రిలే నిరాహార దీక్షలు జూన్ ఏడో తేదీ వరకూ జరుగుతాయని, ఎనిమిదో తేదీన కలెక్టర్లకు వినతులు ఇస్తామని చెప్పారు. ఉద్యోగులతో ప్రభుత్వం అర్థవంతమైన చర్చలు జరుపుతుందని, సమస్యల పరిష్కారానికి పూనుకుంటుందని వేచి చూస్తున్నామని, చాయ్ బిస్కెట్ చర్చలు మాని అర్థవంతమైన చర్చలు చేయాలని కోరారు. అప్పటికి స్పందించకపోతే జిల్లా స్థాయిలో జిల్లా కేంద్రాల వద్ద జూన్ 28, 29, 30, 31 తేదీల్లో ఆందోళన చేపడతామని తెలిపారు. ఆగస్టు ఒకటో తేదీ నుండి జిల్లాస్థాయిలో బహిరంగ నిరసనలు, నెలాఖరు నాటికి రాష్ట్రస్థాయిలో బహిరంగసభ నిర్వహిస్తామని చెప్పారు. అక్టోబర్ 31వ తేదీనాటికి ప్రభుత్వం స్పందించకపోతే నవంబర్ ఒకటో తేదీ నుండి నిరవధిక సమ్మెకు కూడా సిద్ధమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు, కార్యదర్శి కాజా రమేష్, జుత్తిగ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మద్దతు ధరల గ్యారంటీ చట్టం తేవాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

రైతుల పంటలకు మద్దతు ధర దక్కేలా మద్దతు ధరల గ్యారంటీ చట్టం తేవాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలం పాములవారిగూడెంలో రైతాంగ సమస్యలపై కరపత్రాలు పంపిణీ చేసి ఆందోళన చేపట్టారు. సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ 1936 ఏర్పడిన అఖిల భారత కిసాన్ సభ దేశంలో జరిగిన అనేక రైతాంగ ఉద్యమాలకు నాయకత్వం వహించిందని గుర్తు చేశారు. మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో కీలకపాత్ర వహించిందన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేసి రైతుల పంటలకు మద్దతు ధరలు కల్పించేలా చట్టం చేయాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలు, ఈదురు గాలుల వల్ల పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. రైతులు పండించిన మొక్కజొన్న కొనుగోలుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు, మండల కార్యదర్శి సిరిబత్తుల సీతారామయ్య, మండల నాయకులు బిక్కిన వీర సత్యం, సింహాద్రి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గోదావరి వరద ముంపు నివారణకు

ముందస్తు సహాయ చర్యలు చేపట్టాలి : సిపిఎం



మాట్లాడుతున్న సీతారాం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

త్వరలో వర్షాకాలం రానున్న నేపథ్యంలో పోలవరం నిర్వాసిత గ్రామాలను మరోసారి గోదావరి వరదలు ముంచెత్తే ప్రమాదం ఉందని, సహాయ కార్యక్రమాల కోసం ముందస్తు చర్యలు తీసుకుని యంత్రాంగాన్ని సమాయత్తం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బుట్టాయగూడెం ఆదివాసీ విజ్ఞాన కేంద్రంలో సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశంకు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం జూలైలో గోదావరికి వచ్చిన వరదల నష్టాల నుండి ప్రజలు ఇప్పటి వరకూ కోలుకోలేదన్నారు. పోలవరం మునక ప్రాంతాల్లోని ఎనిమిది మండలాల ప్రజలు ఎలాంటి అభివృద్ధికీ, సంక్షేమానికీ నోచుకోక అడవుల్లో చెట్లు, పుట్టలపాలై బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు పూర్తికాకముందే గత జూలైలో వరదలతో వందలాది గ్రామాలు మునిగిపోయాయని, వరదల్లో మునిగిపోయిన గ్రామాల ప్రాతిపదికపై పోలవరం నిర్వాసితుల పునరావాసానికి చర్యలు తీసుకోవాలని ఆనాటి నుండి సిపిఎంతో సహా వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెడచెవిన పెట్టాయని కేంద్రం, ఏజెన్సీ గిరిజన ప్రజలకు ఎలాంటి సహాయం అందించకుండా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు.

పునరావాసానికి నిధులు ఇవ్వలేదని, రాష్ట్ర ప్రభుత్వం రీసర్వే పేరుతో మరో 32 గ్రామాలను కొత్తగా చేర్చి 41.15 మీటర్ల వద్ద మునుగుతాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గ్రామాలకు వాస్తవంగా గత వరదల్లో మునిగిన గ్రామాలకు పొంతనే లేదన్నారు. గత వరదల సమయంలో 150 గ్రామాలు ముంపునకు గురయ్యాయని, పునరావాస కాలనీలు సైతం ఈ వరదల్లో మునిగాయనే వాస్తవాన్ని గమనిస్తే ఈ కాంటూరు లెక్కలన్నీ తప్పుల తడకలేనని విమర్శించారు. కాంటూరు లెక్కలు తప్పని గత వరదలే ప్రామాణికమన్నారు. శాస్త్రీయ ప్రాతిపదికపై రీసర్వే చేసి దాని ఆధారంగా అన్ని గ్రామాలకు పూర్తిస్థాయి పునరావాస చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సిఎం జగన్ అధికారంలోకి రావడంతోనే నష్టపరిహారాన్ని 6.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచుతామని వాగ్దానం చేశారే కానీ, నేటి వరకూ అమలు చేయలేదన్నారు. ఈ నాలుగేళ్లలో భూముల విలువ మరింత పెరిగినా, ఆ విలువల ప్రకారం ఎకరాకు రూ.20 లక్షలు ఇవ్వాలన్నారు. 2023 సెప్టెంబర్ వరకూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ పునరావాస ప్యాకేజీని అందించాలని కోరారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యంలో అల్లూరి జిల్లా ఎటపాక మండలం నెల్లిపాకలో జూన్ 20 నుండి జూలై పదో తేదీ వరకూ విజయవాడకు మహాపాదయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులను పునరావాస కేంద్రాలకు తరలించి ఏళ్లు గడుస్తున్నా కనీసం సదుపాయాలు కల్పించలేదన్నారు. కొన్ని గ్రామాల్లో ఇప్పటికీ తాగునీరు, ట్రాక్టర్ ట్యాంకర్తో నిర్వాసితులకు సరఫరా చేస్తున్నారనిచెప్పారు. పునరావాస కాలనీలకు శ్మశాన వాటికలు లేవని, బడి, అంగన్వాడీ, ఆసుపత్రి, షాపింగ్ కాంప్లెక్స్ తక్షణమే నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈనెల 12న తహశీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష చేపడుతు న్నామని చెప్పారు. ఈ పాదయాత్రకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు మొడియం నాగమణి, జిల్లా కమిటీ సభ్యులు జి.వెంకట్రావు, టి దుర్గారావు, వై.నాగేంద్రరావు, టి ముత్యాలమ్మ, డి.రమేష్, ఎం.జీవరత్నం, టి.సత్యనారాయణ, పి.మంగరాజు, కె.శ్రీనివాస్, ఎ.ఫ్రాన్సిస్, ఎం.దుర్గారావు, పి.నాగేశ్వరావు, ఎస్.బుల్లెమ్మ, ఎస్.రాంబాబు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల్లో నిబంధనలు దారుణం

ప్రజాశక్తి - ముసునూరు

ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని, పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని సిపిఎం జిల్లా నాయకులు జి.రాజు అన్నారు. మండలంలోని ముసునూరు, గోపవరం, వేల్పుచర్ల, కోర్లగుంట గ్రామాల్లో ఉపాధి హామీ పనిప్రదేశాల్లో సిపిఎం నాయకులు బుధవారం పర్యటించారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలు అడిగితెలుసుకున్నారు. మండు వేసవిలో సైతం కూలీలకు తాగునీరు, టెంట్లు ఏర్పాట్లు చేయడం లేదని, మజ్జిగ ప్యాకెట్లు వంటివి ఇవ్వడం లేదని ఉపాధీహామీ కూలీలు నాయకుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జి.రాజు మాట్లాడుతూ ఈ చట్టాన్ని నీరుగార్చేందుకు బిజెపి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందన్నారు. ఈ క్రమంలోనే రెండు పూటలా పనివిధానం, రెండు ఫొటోల అప్లోడ్, వేసవి అలవెన్సు నిలుపుదల, బడ్జెట్లో నిధుల కోత వంటి చర్యలకు బిజెపి పాల్పడుతోందన్నారు.



కూలీల సమస్యలు తెలుసుకుంటున్న జి.రాజు

పోలవరం ప్రాజెక్టులో చిరుత కలకలం



సీసీ కెమెరాలో రికార్డయిన పులి సంచారం

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టు పరిధిలో చిరుతపులి సంచరిస్తుందని, ప్రాజెక్టు కార్మికులు, తరచూ అడవిలో సంచరించేవారు అప్రమత్తంగా ఉండాలని అటవీ క్షేత్రాధికారి దావీదు రాజు సూచించారు. బుధవారం తెల్లవారుజామున పోలవరం ప్రాజెక్టు వాహనానికి స్థానిక 902 హిల్ ప్రాంతంలో గోదావరిలోకి తాగునీటి కోసం దిగి వెళుతున్న చిరుతపులి కనిపించడంతో ప్రాజెక్టు కార్మికులు భయాందోళనకు గురయ్యారు. అనంతరం అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో వారు చిరుతపులి సంచరించిన ప్రాంతానికి వెళ్లి పాదముద్రలు పరిశీలించారు. అనంతరం దావీదు రాజు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు కార్మికులు బహిర్భూమికి బయటకు వెళ్లడం, సరదాగా అడవుల్లో సంచరించడం చేయరాదని, ప్రాజెక్టు కార్మికులు చికెన్ వ్యర్థాలు, ఇతర మాంసాహార పదార్థాలు బహిరంగ ప్రదేశాల్లో పడవేయరాదని, అడవుల్లో కట్టెలు కొట్టుకునే వారు కలప కోసం వెళ్లేవారు రిజర్వ్ ఫారెస్ట్ ఏరియాలో సంచరించరాదని హెచ్చరించారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పివి.మధుకర్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ డి.రాజేష్ చిరుతపులి సంచరించిన ప్రాంతాల్లో పాదముద్రల సేకరణలో పాల్గొన్నారు. అనంతరం పోలవరం ప్రాజెక్టు కార్మికుల లేబర్ క్యాంపులో చిరుత సంచారంపై అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు.

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాకేంద్ర ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని రెడ్క్రాస్ తలసేమియా భవనంలో 11 మంది తల సేమియా చిన్నారులకు బుధవారం రక్తమార్పిడి చేసినట్లు జిల్లా రెడ్క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. వేసవికాలం కారణంగా రక్తదాతల కొరత ఏర్పడినప్పటికీ క్రమం తప్పకుండా తలసేమియా చిన్నారులకు రక్త మార్పిడి నిర్వహిస్తున్నామన్నారు. స్వచ్ఛంద రక్తదాతలు స్పందించి రక్తదానం చేసి తలసేమియా చిన్నారులను ఆదుకోవాలని కోరారు. చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులు 30 మందికి ఏలూరు సత్యసాయి సేవా సమితి వారు మధ్యాహ్నం ఉచిత భోజనం ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్ఎస్ఆర్కె.వరప్రసాదరావు, స్టాఫ్ నర్సులు డి.గౌతమి, మౌనిక పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

పెండింగ్ కేసుల విచారణ పూర్తి చేయాలి
ఎస్పి మేరీప్రశాంతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన విచారణ పూర్తి చేసి నిందితులకు శిక్ష పడేవిధంగా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పి మేరీ ప్రశాంతి ఆదేశించారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి జిల్లాలో ఉన్న అన్ని సబ్ డివిజన్ పరిధిలో డిఎస్‌పిలు, సిఐలు, ఎస్‌ఐలతో ఎస్పి మేరీప్రశాంతి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల గురించి ఆమె అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ పాత కేసుల్లో ఎన్‌బిడబ్ల్యులు, వారెంట్లు, సంబంధిత వ్యక్తులకు అందించి వెంటనే వారిని కోర్టులో హాజరు పరచాలని తెలిపారు. కేసుల్లో ఉన్న సాక్షులను కోర్టుల్లో ప్రవేశపెట్టి నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోక్సో కేసుల్లో ఛార్జిషీట్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. విధులు నిర్వహించడంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్‌బి ఎం సుబ్బారావు, డిసిఆర్‌బి సిఐ దుర్గాప్రసాద్, ఎస్‌ఐ సాదిక్ పాల్గొన్నారు.

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్షలో హరికృష్ణ ప్రతిభ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం


హరికృష్ణ

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ సిజిఎల్ పరీక్షలో మండలంలోని శ్రీనివాసపురం గ్రామానికి చెందిన తూంపాటి హరికృష్ణ జాతీయస్థాయిలో 57వ ర్యాంకు సాధించారు. 2022 స్టాఫ్ సెలక్షన్ కమిషన్ సిజిఎల్ పరీక్షలో ఆల్ ఇండియా 57వ ర్యాంకు సాధించి సెంట్రల్ గవర్నమెంట్లో కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ డిపార్ట్‌మెంట్‌లో గెజిటెడ్ హోదా ఉద్యోగం సొంతం చేసుకున్న హరికృష్ణను జెడ్‌పిటిసి సభ్యులు పొల్నాటి బాబ్జి అభినందించారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లడుతూ తమ గ్రామానికి చెందిన తూంపాటి హరికృష్ణ ఐఐటి గౌహతిలో బిటెక్ చదివినట్లు చెప్పారు. హరికృష్ణను పొల్నాటి బాబ్జి శాలువాతో సత్కరించారు.

అక్కంపేటలో ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఉపాధి హామీ పనుల్లో ప్రభుత్వం అందించే సౌకర్యాలపై కూలీలు అవగాహన పొందాలని అక్కం పేట గ్రామ సర్పంచి పారేపల్లి నాగేంద్రబాబు అన్నారు. మండలంలోని అక్కంపేట గ్రామంలో జరుగుతున్న జాతీయ ఉపాధి హామీ పనులను గ్రామ సర్పంచి పారేపల్లి నాగేంద్రబాబు, ఉప సర్పంచి వింజమూరి కిరణ్‌కిషోర్, సెక్రటరీ బ్రహ్మయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచి కిరణ్ కిషోర్ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం గురించి కూలీలకు అవగాహన కల్పించి ఉపాధి హామీతో పాటు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచి సమక్షంలో వింజమూరి కిరణ్ కిషోర్ మస్టర్లను, వీక్లీ పేమెంట్ పే స్లిప్‌లు పరిశీలించారు. ఫీల్డ్ అసిస్టెంట్ పింగుల మంగారావు ఆధ్వర్యంలో కూలీలకు చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడవద్దని తెలిపారు. పని ప్రదేశంలో మెడికల్ కిట్లు, టెంట్, తాగునీరు అందుబాటులో ఉండాలని సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ లైన్లకు మరమ్మతు చేయాలి

ప్రజాశక్తి - చింతలపూడి

ఈదురుగాలులకు పట్టణంలో విద్యుత్ లైన్లు పాక్షికంగా దెబ్బతిని మూడు రోజులైనా పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా అందించడంలో అధికారులు విఫలమయ్యారనిసిపిఎం పట్టణ కన్వీనర్ ఎస్.సూర్యకుమార్ అన్నారు. విద్యుత్ కొరతతో నగర పంచాయతీకి జనరేటర్ సౌకర్యం లేక మంచినీటి సరఫరా చేయలేకపోవడంతో నగర పంచాయతీ ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, కలెక్టర్ స్పందించి చింతలపూడి ప్రజలకు విద్యుత్, మంచినీటి అసౌకర్యం నుంచి కాపాడాలని కోరారు.

అరవింద్ కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి - చింతలపూడి

పట్టాయిగూడెంలో విద్యుదాఘాతంతో చనిపోయిన అరవింద్ కుటుంబానికి విద్యుత్ శాఖ రూ.10 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని సిఐటియు మండల అధ్యక్షులు నత్తా వెంకటేశ్వరరావు, కార్యదర్శి బాలరాజు డిమాండ్ చేశారు. విద్యుత్ ఉద్యోగులకు హెల్పర్లుగా ప్రయివేట్ వ్యక్తులు ఉండకూడదన్నారు. ఈ మేరకు వరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ సిబ్బంది కొరతతో అనేక సబ్‌స్టేషన్ పరిధిలో లైన్‌మెన్లు, ఇతర ఉద్యోగులు పని ఒత్తిడి వల్ల గ్రామాలో, పట్టణాల్లో తమకు అసిస్టెంట్లుగా విద్యుత్ పని వచ్చిన బయట వ్యక్తులను పెట్టుకుంటున్నారు. వారు విద్యుత్ స్తంభాలను ఎక్కి ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లైన్‌మెన్లకు అసిస్టెంట్లుగా ఉన్న అనధికార వ్యక్తులు ప్రమాదాలకు గురై మృతి చెందడంతో కుటుంబసభ్యులకు ఆవేదన మిగులుతుందన్నారు. మేడిశెట్టివారిపాలెం గ్రామానికి చెందిన వ్యక్తి అరవింద్ పట్టాయిగూడెం లైన్‌మెన్ వద్ద సహాయకుడిగా చేస్తూ స్తంభం ఎక్కి విద్యుత్ మరమ్మతు పనులు చేస్తుండగా షాక్‌కు గురై మృతి చెందాడు. అనేక రకాల విద్యుత్ సర్వీసులు పెరిగి విస్తీర్ణం పెరిగిన ప్రస్తుత కాలంలో సిబ్బందిని పెంచకపోవడం విద్యుత్ శాఖ వైఫల్యమన్నారు. పట్టాయిగూడెంలో చనిపోయిన వ్యక్తి కుటుంబానికి విద్యుత్ శాఖ రూ.10 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

వాహనాల వేగం నియంత్రించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని ఎస్ఐ కె.సతీష్‌కుమార్ అన్నారు. మండలంలోని బొర్రంపాలెంలో వేగ నియంత్రణ బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు వేగంగా వాహనాలు నడపడం ద్వారా అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ద్విచక్రవాహనదారులందరూ తప్పనిసరిగా హెల్మెట్ వాడాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

నేరాలు - ఘోరాలు

విత్తన దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి- జంగారెడ్డిగూడెం

పట్టణంలోని విత్తన దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. బుధవారం పట్టణంలోని శ్రీదేవి ఆగ్రో ఏజెన్సీలో విజిలెన్స్ డిఎస్‌పి ఎస్.వెంకటేశ్వరరావు సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. రికార్డులకు గోడౌన్‌లో నిల్వకు వ్యత్యాసాన్ని గుర్తించి రూ.1,18,740 విలువైన 3.71 క్వింటాళ్ల కూరగాయ, అపరాలు విత్తనాలను సీజ్ చేశామని తెలిపారు. 6ఎ కేసు నమోదు చేశామని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని, ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా జిల్లాలోని జంగారెడ్డిగూడెం, నూజివీడు, చింతలపూడి విత్తన షాపుల్లో విస్తృత తనిఖీలు జరిగాయని తెలిపారు. ఆయనతో పాటు విజిలెన్స్ డిఇ పి.శ్రీనివాస్, ఎఇ పి.సురేష్, ఎఒ కె.నాగరాజు, ఎస్ఐ పి.శ్రీధర్ పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : నూజివీడు పట్టణంలోని పలు విత్తన దుకాణాల్లో బుధవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. పట్టణ పరిధిలోని అనేక విత్తనాల కంపెనీలకు చెందిన దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ రంజిత్ కుమార్ బృందం తనిఖీలు చేశారు.

పిడుగుపాటుకు పాడి గేదె మృతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో మంగళవారం భీకర గాలితో పాటు పిడుగులతో కూడిన వర్షానికి పాడి గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని కాకరవాడ శివారు దేవరం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... దేవరం గ్రామానికి చెందిన పెండెల్లి శంకరానికి చెందిన ముర్రజాతి పాడి గేదె వర్షానికి ముందు ఇంటి సమీపంలోని చేల్లో మేస్తోంది. ఈ క్రమంలో ఆకస్మాత్తుగా బీకర గాలి, పిడుగులతో కూడిన వర్షం పడింది. దీంతో గేదె మేస్తోన్న చేను సమీపంలో పిడుగు పడింది. దీంతో పిడుగు శబ్దానికి గేదె అక్కడికక్కడే ప్రాణం విడిచింది. రైతు శంకరం మాట్లాడుతూ ఆరు నెలలు క్రితమే గేదె ఈనిందన్నారు. రెండు పూటలు పది లీటర్ల పాలు ఇస్తుందన్నారు. చూడిగా ఉన్నప్పుడు రూ.లక్ష వరకు బేరం వచ్చిందనో, పాలు బాగా తీస్తుందని అమ్మలేదన్నారు. పిడుగు పడడంతో గేదె మృతి చెందినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు.

మాకు న్యాయం చేయండి మహాప్రభో..!

నోటీసులివ్వకుండా మా ఇళ్లు జెసిబితో ధ్వంసం చేశారు
సర్పంచి భర్త కక్ష సాధింపు చర్యలు సరికావు
చేవూరు ఎస్‌టి కాలనీ వాసుల ఆవేదన


ఇళ్లు కూల్చివేతతో నిరాశ్రయులైన ఎస్‌టిలు

ప్రజాశక్తి - ముదినేపల్లి


ఇంటి పన్ను రశీదు చూపిస్తున్న మహిళ

"గ్రామ సర్పంచి భర్త ఆగడాలకు మేము రోడ్డున పడ్డాం. మాకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా, మేము ఇంటి వద్ద లేని సమయంలో జెసిబితో మా ఇళ్లు ధ్వంసం చేశారు. దీంతో మాకు రూ.ఐదు లక్షల మేర ఆస్తి నష్టం సంభవించింది" అని మండలంలోని చేవూరు గ్రామ ఎస్‌టి కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధితులు కట్టా సుబ్బారావు, కట్టా ఏడుకొండలు, కుంభ వెంకటేశ్వరరావు, కుంభా నాంచారమ్మ తమ బాధను వివరించారు. మండలంలోని చేవూరు గ్రామంలో గత 108 సంవత్సరాలుగా మంచినీటి చెరువు వద్ద ఎస్‌టిలు జీవిస్తున్నారు. ఇంటిపన్ను, కరంట్ బిల్లు, ఇంటి పట్టా అన్నీ ఉన్నాయన్నారు. ఎస్‌టిలు ఇంటి వద్ద లేని సమయంలో ఎలాంటి సమాచారం, నోటీసులు ఇవ్వకుండా గ్రామ సర్పంచి భర్త వల్లభనేని వెంకట్రావు, గ్రామ విఆర్ఒ, అధికారులు, పోలీసులుతో వచ్చి తమ ఇళ్లను జెసిబితో కూల్చివేశారని వాపో తున్నారు. రెండు ఇళ్లల్లో నాలుగు కుటుంబాలు నివాసి స్తున్నాయన్నారు. ఇళ్లు కూల్చి వేత విషయం తెలుసుకుని పరుగు, పరుగున వచ్చి అడ్డుకోబోగా తమను సర్పంచి భర్త వెంకట్రావు దుర్బాషలాడినట్లు తెలిపారు. "మీరు ఇక్కడ ఉండడానికి వీలు లేదు, వెంటనే వెళ్లిపోవాలి, కూల్చివేత పనులు అడ్డుకుంటే మిమ్మల్ని కూడా ఇంటితో పాటు జెసిబితో తొక్కించి వేస్తాం' అని బెదిరించినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనలో ఇళ్లల్లోని టివిలు, బీరువాలు, గృహోపకరణాలన్నీ పగిలిపోయినట్లు చెప్పారు. అంతేకాకుండా ఇళ్లను, ఇళ్లల్లోని అన్నీ వస్తువులను జెసిబితో తీసుకువెళ్లి చెరువులో పూడ్చివేసినట్లు చెబుతున్నారు. ఈ ఘటనలో రూ.ఐదు లక్షలు మేర ఆస్తి నష్టం జరిగినట్లు ఎస్‌టిలు చెబుతున్నారు. తరతరాలుగా ఇక్కడ నివాసం ఉంటున్న తమను కక్షసాధింపుతో వెంకట్రావు తొలగించాలని చూస్తున్నారన్నారు. వైసిపికి చెందిన వారు కాదని, వేరే పార్టీకి చెందిన వారంటూ వెంకట్రావు తమపై పెట్టే హింసాకు చనిపోవాలనిపిస్తుందంటూ ఎస్‌టి మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు కారణమైన వల్లభనేని వెంకట్రావుపై అధికారులు తగిన చర్యలు తీసుకొని, కూల్చివేసిన తమ ఇళ్లను తిరిగి పున:నిర్మించాలని, నష్టపోయిన తమకు నష్టపరిహారం ఇప్పించి, తాము ఇక్కడే ఉండేవిధంగా అధికారులు చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని ఎస్‌టి కాలనీ వాసులు కోరుతున్నారు.

చెరువు విస్తరణ చేయాలి
గ్రామ సర్పంచి వి.లక్ష్మి

గ్రామ జనాభాకు నీరు అందిచేందుకు సరిపడ చెరువు సామర్థ్యం లేదు. చెరువు విస్తరణ పనులు చేయాలి. ఎస్‌టిలకు ముందస్తు నోటీసులు ఇచ్చాం. వారిలో ఇద్దరికి ఇళ్ల స్థలాలు ఇచ్చాం. ఎస్‌టిలు చెరువు గట్టుపై పందులను పెంచుతున్నారు. అవి చెరువులో దిగి నీటిని కలుషితం చేస్తున్నాయి. నా భర్త వెంకట్రావు ఎస్‌టిలను దుర్భాషలాడలేదు. అందులో నిజం లేదు.

స్పందన ఫిర్యాదుపై సబ్ కలెక్టర్ విచారణ

ప్రజాశక్తి - చాట్రాయి

స్పందన ఫిర్యాదుపై సబ్ కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్ మండలంలోని పర్వతాపురం గ్రామంలో మంగళవారం విచారణ చేపట్టారు. మండలంలోని పర్వతాపురం గ్రామానికి చెందిన కల్లేపల్లి వెంకటేశ్వరరావు తండ్రి కృష్ణయ్యకు తన తండ్రి పంచిన స్థిరాస్తి సర్వే నెంబర్ 94 ఖాతా నెంబర్ 952లో సాగు భూమి ఉంది. ఈ భూమికి పక్క సరిహద్దుదారులైన సర్వేనెంబర్ 93 చెందిన కల్లేపల్లి రాజారావు, కృష్ణ, కల్లేపల్లి సుబ్బారావు, మధు, వెంకటేశ్వరరావు, దశరధి కుమారు, రామయ్యలు అక్రమంగా రాత్రి సమయంలో కల్లేపల్లి వెంకటేశ్వరరావు భూమిలోకి రాళ్లు వేసుకొని వెంకటేశ్వరరావు భూమిని 21.50 సెంట్లు ఆక్రమించుకున్నారు. దీనిపై వెంకటేశ్వరరావు ప్రశ్నించగా దాడి చేసేందుకు యత్నించారు. దీంతో వెంకటేశ్వరరావు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అర్జీ పెట్టుకున్నాడు. సమస్య పరిష్కారం కాకపోవడంతో డివిజనల్ సర్వేర్‌కు అర్జీ పెట్టుకున్నాడు. డివిజనల్ సర్వేయర్ వచ్చి ఇరు గ్రూపుల వారికి సరిహద్దు రాయిని వేసి వెళ్లారు. మళ్లీ పక్క సరిహద్దుదారులు డివిజనల్ సర్వర్ వేసిన రాయిని కూడా రెండో సారి తీసేశారు. జూన్ 9వ తేదీ 2022 నుంచి సమస్య పరిష్కారం కోసం గ్రామ నాయకులు చుట్టూ, స్థానిక తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగాడు. పరిష్కారం లభించకపోవడంతో రీ ఓపెనింగ్ స్పందన అర్జీ సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంగళవారం సబ్ కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్ పర్వతాపురం గ్రామం వెళ్లి పరిశీలించి విచారణ చేపట్టారు. భూమికి ఫెన్సింగ్ వేసుకోవాలని వెంకటేశ్వరరావుకు సబ్ కలెక్టర్ సూచించారు. డివిజన్ సర్వేయర్ వేసిన సరిహద్దు రాయిని తీస్తే చట్టప్రకారంగా తగు చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు.

పొగాకుకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

పొగాకు వల్ల క్యాన్సర్ వంటి ప్రమాదకార రోగాల బారినపడే అవకాశం ఉందని, పొగాకు వల్ల వచ్చే ప్రమాదాలపై అవగాహన లేకపోవడం వల్ల చాలా మంది రోగాల బారిన పడుతున్నారని ఆగిరిపల్లి గ్రామ సర్పంచి చౌటపల్లి లక్ష్మీవిక్టర్‌బాబు అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆగిరిపల్లిలో నవజీవన్ బాల భవన్ వారు ఏర్పాటు చేసిన సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన నేను పొగాకు వ్యతిరేకిని అని సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ బాల భవన్ జోనల్ కో-ఆర్డినేటర్ డి.వసంత కుమారి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జి.రాగమయి, మహిళా సంరక్షణా కార్యదర్శులు పి.కృష్ణస్వాతి, జి.రాణి పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : నూజివీడు ఆర్‌టిసి బస్టాండ్‌లో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో బుధవారం సంతకాల సేకరణ, వాల్‌పోస్టర్ ఆవిష్కరణ కారక్రమం నిర్వహించారు. డిపో మేనేజర్ సిహెచ్.పవన్‌కుమార్ మాట్లాడుతూ పొగ తాగటం ఆరోగ్యానికి హానికరమన్నారు. బాల భవన్ జోనల్ కో-ఆర్డినేటర్ బి.రవి, ఆర్‌టిసి ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్ ఎం.రజిని పాల్గొన్నారు.

మున్సిపాలిటీ భవనం పేరు మార్పునకు తీర్మానం
టిడిపి, జనసేన కౌన్సిలర్ల అభ్యంతరం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీని వైఎస్.రాజశేఖర్ రెడ్డి పురపాలక సంఘంగా పేరు మార్పును సమర్థిస్తూ పాలకవర్గ సమావేశంలో వైసిపి కౌన్సిలర్లు చేసిన ఏకగ్రీవ తీర్మానంపై అభ్యంతరం తెలుపుతూ టిడిపి, జనసేన కౌన్సిలర్లు డీసెంట్ సమర్పించారు. బుధవారం స్థానిక మున్సిపల్ పాలకవర్గ సమావేశం మున్సిపల్ కమిషనర్ భవానీప్రసాద్ పర్యవేక్షణలో చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకవర్గ సమావేశంలో ప్రవేశపెట్టిన అజెండాలో మున్సిపల్ కార్యాలయం పేరును వైఎస్.రాజశేఖరరెడ్డి పురపాలక సంఘంగా పేరుమార్పును ఆమోదించాలనే అంశంపై టిడిపి కౌన్సిలర్లు కరటూరి రమాదేవి, నంబూరి రామచంద్రరాజు, తెల్లగారపు జ్యోతి, జనసేన కౌన్సిలర్ ఉలవల తాతాజీ అభ్యంతరం వ్యక్తం చేశారు. అయినప్పటికీ వైసిపి కౌన్సిలర్ల మద్దతు ఎక్కువగా ఉండటంతో మున్సిపాలిటీ పేరును రాజశేఖర్‌రెడ్డి పురపాలక సంఘంగా మార్పు చేయాలని ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ క్రమంలో అసంతృప్తి వ్యక్తం చేసిన కౌన్సిలర్లు చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మికి డీసెంట్ సమర్పించారు. గతంలో ఎన్‌టిఆర్ పురపాలక సంఘ కార్యాలయంగా నామకరణం చేసి శంకుస్థాపన జరిగిన విషయాన్ని గుర్తు చేసే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ ప్రస్తుత ప్రభుత్వ రికార్డుల్లో జంగారెడ్డిగూడెం పురపాలక సంఘంగా మాత్రమే నమోదైందని, అందువల్ల వైఎస్.రాజశేఖర్ రెడ్డి పురపాలక సంఘంగా మార్పు చేయడానికి ఆమోదించామని వైసిపి కౌన్సిలర్లు పేర్కొన్నారు. అనంతరం పట్టణంలోని పలు వార్డుల్లో అభివృద్ధికి కేటాయించిన నిధులపై చర్చ కొనసాగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎఇ పి.సంధ్యారాణి, పట్టణ ప్రణాళిక అధికారి జగదీశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమణ, మేనేజర్ రమణ, సిబ్బంది, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నేడు వైఎస్ఆర్ రైతు భరోసా సొమ్ము విడుదల

భీమడోలు :భీమడోలు మండలానికి వైఎస్ఆర్ రైతు భరోసా ఐదో విడత తొలి వాయిదాగా ఒక్కొక్క రైతుకు రూ.5500 వంతున 4,337 మంది రైతులకు రూ.2.38 కోట్లు మంజూరయ్యాయని భీమడోలు వ్యవసాయ అధికారి ఉషారాణి తెలిపారు. రైతు భరోసా పథకం కింద కేంద్ర ప్రభుత్వం పిఎం కిసాన్ కార్యక్రమంలో భాగంగా రూ.ఆరు వేలు రైతుల ఖాతాకు జమ చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం తొలి విడతగా రూ.5500 వంతున, రెండో విడతగా రూ.రెండు వేలు వంతున రైతులకు అందిస్తుందని తెలిపారు. ఈ మెత్తాలను వారి ఖాతాలకు నేరుగా జమ చేస్తున్నట్లు వ్యవసాయ అధికారి చెప్పారు. ప్రస్తుతం మంజూరైన తొలి విడత నిధులు సిఎం ద్వారా జూన్ ఒకటో తేదీన వారి బ్యాంకు ఖాతాలకు జమవుతాయని వ్యవసాయ అధికారి తెలిపారు. భీమడోలు మండలానికి వ్యవసాయ యంత్ర సేవా పథకం కింద రూ.పది లక్షల రాయితీ మంజూరైందని వ్యవసాయ అధికారి తెలిపారు. దీనిలో భాగంగా మండలానికి చెందిన సిహెచ్‌సి గ్రూపులకు నాలుగు ట్రాక్టర్లు, రూ.1.35 లక్షల విలువైన మూడు రోటావీటర్లు, రూ.నాలుగు వేల విలువైన బ్యాటరీ స్ప్రేయర్లు మంజూరయ్యాయన్నారు. ట్రాక్టర్ యూనిట్ ఒక్కొక్కదానికి రాయితీ రూ.రెండు లక్షలు, రోటావీటర్ యూనిట్ ఒక్కొక్క దానికి రూ.35 వేల వంతున రాయితీ ఉంటుందన్నారు. సిహెచ్‌సి గ్రూపుల పేర మంజూరైన రాయితీని ఈ నెల రెండో తేదీన ముఖ్యమంత్రి సదరు సిహెచ్‌సి గ్రూపుల ఖాతాలకు జమ చేయనున్నారని వ్యవసాయ అధికారి తెలిపారు.

రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభం
ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ముదినేపల్లి

సర్వర్ సాంకేతిక సమస్యతో రెండు రోజులుగా ముదినేపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో నిలిచిపోయిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఎట్టకేలకు బుధవారం తిరిగి ప్రారంభమయ్యాయి. సోమ, మంగళవారాలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన కొనుగోలుదారులు సర్వర్ డౌన్ కావడంతో పలు రకాల ఇబ్బందులు పడ్డారు. వృద్ధులు, వికలాంగులు ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరీక్షించారు. అయినా సమస్య పరిష్కారం కాలేదు. ఈ విషయమై ఈ నెల 31వ తేదీ బుధవారం ప్రజాశక్తిలో సర్వర్ డౌన్ ముదినేపల్లిలో నిలిచిన రిజిస్ట్రేషన్లు అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి సర్వర్ సాంకేతిక సమస్య పరిష్కారించడంతో రెండు రోజుల తర్వాత యధావిధిగా బుధవారం రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగింది. దీంతో కొనుగోలుదారుల క్రయవిక్రయాలు నిర్వహించారు.


బ్యాంకుకు ఎదురుగా వాహనాలు పార్కింగ్
దారి లేక ఖాతాదారుల ఇబ్బందులు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి


బ్యాంకు దారికి అడ్డంగా ఉన్న ద్విచక్ర వాహనాలు

మండల కేంద్రమైన ఆగిరిపల్లిలోని సప్తగిరి గ్రామీణ బ్యాంకులోకి వెళ్లేందుకు దారి లేక ఖాతాదారులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహనదారులు తమ వాహనాలను దారికి అడ్డంగా అస్తవ్యస్థంగా పెట్టడం, పక్కనే ఎస్ఎస్ రెస్టారెంట్ ఉండటంతో రెస్టారెంట్‌కు వచ్చేవారు తమ వాహనాలను అక్కడే పార్కింగ్ చేయడంతో బ్యాంకు లోపలికి వెళ్లాలంటే దారి లేక మహిళలు పలు అవస్థలు పడుతున్నారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీల నుంచి ఖాతాదారులు బ్యాంకుకు వస్తుంటారు. సప్తగిరి బ్యాంకు దారికి అడ్డంగా వాహనాలు పార్కింగ్ చేయకుండా చర్యలు చేపట్టాలని ఖాతాదారులు కోరుతున్నారు.

రైతుల సేవా తత్పరత అభినందనీయం


వికలాంగులకు బియ్యం,నిత్యావసర వస్తువులు అందిస్తున్న దాతలు

ప్రజాశక్తి - భీమడోలు

గుండుగొలను కేంద్రంగా వికలాంగుల సంక్షేమానికి కృషి చేస్తున్న స్థానిక శ్రీ విఘ్నేశ్వర వికలాంగుల సేవా సమితి సేవలు అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. సేవా సమితి కార్యాలయంలో బుధవారం నిర్వహించిన నెలవారి ప్రత్యేక కార్యక్రమంలో దాత దాట్ల వెంకటరామరాజు గ్రామానికి చెందిన 50 మంది వికలాంగులకు సన్నబియ్యం, పండ్లు, నిత్యావసర వస్తువులు, పౌష్టికాహారాన్ని సేవా సమితి సభ్యుల ద్వారా అందించారు. ఈ సందర్భంగా సేవా సమితి ప్రతినిధులు గేదెల శ్రీనివాసరావు, పేరిచర్ల శ్యామలరావు, ఎ.సోములు మాట్లాడుతూ సేవా సమితి చేపడుతున్న సేవా కార్యక్రమాల పట్ల స్థానిక రైతులు స్పందించి సహకరించటం అభినందనీయమన్నారు. గ్రామానికి చెందిన సుమారు 200 మంది రైతులు ప్రతి వ్యవసాయ సీజన్‌లో తమ పంట నుంచి, తమకు గల పొలం ఆధారంగా రెండు నుంచి మూడు చారల(40 కేజీల ధాన్యం) సేవా కార్యక్రమాల కోసం అందిస్తున్నారని తెలిపారు. వీరందరూ తమ తొలి పంటను వికలాంగులకు కేటాయించడం ద్వారా సేవా కార్యక్రమాల్లో తాము సైతం భాగస్వాములైనట్లు భావిస్తున్నారని తెలిపారు. వీరందరినీ సేవా సమితి తరపున బుధవారం సన్మానించినట్లు వారు తెలిపారు.

ఆటపాకలో ఇళ్ల పట్టాల పంపిణీ

కైకలూరు :అర్హులందరికీ ఇంటి స్థలం ఇచ్చి గృహాలు నిర్మిస్తామని శాసన సభ్యులు దూలం నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆటపాకలో ఇళ్లపట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ డిఎన్ఆర్ మాట్లాడుతూ ఇళ్లపట్టాలను కొంతమందికి ముందుగా ఇచ్చామని, మిగిలిన వారికి పట్టాలు ఇచ్చి పోసిషన్ సర్టిఫికెట్లు ఇస్తున్నామని తెలిపారు. అర్హులందరికీ ఇళ్ల స్థలం కేటాయిస్తామన్నారు. గ్రామంలో స్థలాలు లేకపోతె కైకలూరులో ఇవ్వటానికైనా సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులందరు త్వరితగతిన గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అడవి వెంకట కృష్ణ మోహన్, ఎంపిటిసి సభ్యులు పట్టపు బాలమ్మ, తంబిశెట్టి లక్ష్మి, కన్నా రమేష్, సింగంశెట్టి రాము, బావిశెట్టి పాములు, కన్నా బాబు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు
వాల్టా చట్టానికి తూట్లు

ప్రజాశక్తి - ఉంగుటూరు


అధికారులు సీజ్ చేసిన లారీ, జెసిబి

వాల్టా చట్టానికి మట్టి మాఫియా నిర్వాహకులు తూట్లు పొడుస్తున్నారు. అనుమతుల్లేకుండా పొలాలు, చెరువులు, గుంతల్లోనూ రేయింబవళ్లు మట్టితవ్వి భారీ వాహనాల్లో తరలించి అమ్మేస్తున్నారు. మండలంలో చేబ్రోలు-తల్లాపురం, చేబ్రోలు-నారాయణపురం పుంత రోడ్డు, తిమ్మయ్యపాలెం, గుళ్లపాడు, నాచుగుంట, కైకరం, గోపీనాథపట్నం ఇలా అనేక చోట్ల రాత్రీ పగలూ తేడా లేకుండా జెసిబి, పొక్లెయిన్లతో మట్టిని తవ్వి టిప్పర్లు, లారీలు, ట్రాక్టర్ల సాయంతో రవాణా చేస్తున్నారు. వాహనాల రద్దీతో దుమ్ము, ధూళీ దట్టంగా వ్యాపించి స్థానిక ప్రజలు కాలుష్యం బారిన పడుతున్నారు. ఇటీవల రెవెన్యూ అధికారులు మూడు ట్రాక్టర్లు, మూడు లారీలను సీజ్ చేసినా మట్టి అక్రమదారులు ట్రాక్టర్లను విడిపించుకుపోయారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మంగళవారం రాత్రి తల్లాపురం- నారాయణపురంలో పొలాల్లో మట్టి తవ్వుతున్న జెసిబిని, లారీని మైనింగ్ అధికారులు సీజ్ చేసి తహశీల్దారు కార్యాలయానికి తరలించారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ : ఎఇ

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో మంగళవారం వీచిన భీకర గాలి, వానతో విద్యుత్ తీగలపై పిడుగులు పడడంతో విద్యుత్ శాఖకు అపార నష్టం వాటిల్లింది. పిడుగు పాటుకు విద్యుత్ శాఖకు రూ.ఐదు లక్షల మేర తీవ్ర నష్టం వాటిల్లినట్లు విద్యుత్ శాఖ ఎఇ పి.రవికుమార్ బుధవారం తెలిపారు. మండల వ్యాప్తంగా అన్నీ గ్రామాల్లో పిడుగులు విద్యుత్ తీగలపై పడడంతో తీగలు తెగిపోయి గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మంగళవారం రాత్రి ఏడు గంటలకు అన్నీ గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరించారు. ఆక్వా చెరువులకు మాత్రం బుధవారం ఉదయానికి విద్యుత్ పునరుద్ధరించారు. పిడుగుల దాటికి తీగలు తెగి, ట్రాన్స్‌ఫార్మర్లు పాడైపోవడంతో పాటు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. దీంతో ఎఇ రవికుమార్ తన సిబ్బందితో హుటాహుటినా మరమ్మత్తులకు గురైన వాటి స్థానంలో శరవేగంగా విద్యుత్ పునర్ధరణ పనులు చేపట్టి ప్రజలకు, ఆక్వా రైతులకు ఎలాంటి విద్యుత్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

ఉపాధ్యాయులుగా పనిచేసేందుకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని అప్పలరాజుగూడెం ఎపి బాలుర గురుకుల పాఠశాలలో తాత్కాలిక ప్రాతిపదికన ఇంగ్లీషు, లెక్కలు ఉపాధ్యాయులుగా పని చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ టి.నరసింహస్వామి తెలిపారు. తాత్కాలిక ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పిజిటి ఇంగ్లీష్, పిజిటి లెక్కలు సబ్జెక్టుల్లో ఎంఎ లేదా ఎంఎస్‌సిలో ప్రథమశ్రేణి, ద్వితీయ శ్రేణిలో, బిఇడిలో ఉత్తీర్ణత సాధించి కనీసం 50 శాతం మార్కులు, టెట్ అర్హత పొంది ఉండాలని తెలిపారు. 8, 9, 10 తరగతుల్లో కనీసం మూడేళ్ల బోధన అనుభవం కలిగి ఉండాలన్నారు. జూన్ 5వ తేదీలోపు పాఠశాల ప్రిన్సిపల్ టి.నరసింహస్వామిని నేరుగా కలిసి దరఖాస్తు అందించాలని తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఆపదలో ఉన్నవారిని మానవత్వంతో ఆదుకోవాలని మాజీ ఎంపిపి కొత్త ప్రకాష్‌బాబు అన్నారు. మండలంలోని బొర్రంపాలెం గ్రామంలో మంగళవారం కురిసిన వర్షానికి రేళ్ల దుర్గారావు తాటాకిల్లు నేలకూలింది. బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయంతో పాటు 25 కేజీల బియ్యం బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ప్రభుత్వం ద్వారా ఇల్లు మంజూరు చేయడానికి కృషి చేస్తానన్నారు.

ఎల్ఎన్‌డి పేటలో అన్నసమారాధన

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని ఎల్ఎన్‌డి పేట గ్రామంలో మూడు రోడ్ల జంక్షన్‌లో బుధవారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు, ఇతర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఇల్లా సత్యనారాయణ, గుబ్బా రాంబాబు మాట్లాడుతూ కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో సుమారు మూడు వేల మంది పాల్గొన్నట్లు తెలిపారు.